


# ఓడిక

**- పి.ఎస్.నారాయణ**

**ఒక్కసారి జనమంతా ఘొల్లుమంటూ కేకలు... ఎక్కడో మంటలు రేగి ఊరు ఊరంతా తగలడుతున్నదా అన్నట్లుగా అరుపులు...**

రాత్రి పన్నెండు గంటలయింది అన్నట్లుగా కటిక చీకటి... ఏదో వాసన... నీళ్ళు పరుగెడుతున్న శబ్దం...

చంద్రయ్య చటుక్కున మంచం మీదనుంచి లేచి కాలు కింద పెట్టాడు. నీళ్ళు... కాళ్ళను తడుపుతూ నీళ్ళు. ఉలిక్కిపడ్డట్టుగా వంగొని ఆ నిద్రమత్తులోనే కళ్ళు చించుకు చూశాడు. జలజలమంటున్న నీళ్ళు...

పక్కన మంచంమీద పడుకున్న చంద్రమ్మను లేపాడు హడావుడిగా... దాన్నే కరుచుకుపడుకున్న మూడేళ్ళ కొడుకు వంక చూచాడు.

బయటనుంచి అరుపులు ఎక్కువయినయి...

"అరేయ్ చంద్రయ్యా! త్వరగా రండిరా... వరదొచ్చిందిరా!"

ఒక్క ఉదుటున మంచం మీదనుండి దూకి, ఆ నీళ్ళలోనే కాళ్ళకు తగులుతున్న గిన్నెల్ని తన్నుకుంటూ హడావుడిగా తలుపుతీశాడు...

సర్వం జలమయం...

అప్పటికే జనం రోడ్లమీద మోకాళ్ళ లోతు నీళ్ళలో పరుగెడుతున్నారు. తమిల్లు కాస్త ఎత్తుమీద ఉండటంతో పాదాలే తడుస్తున్నయి.

"త్వరగా లేచి పిల్లాడిని తీసుకో!" భార్యతో అంటూ వెనక్కు వచ్చాడు...

అప్పటికే గుడిశెలో నేలంతా తడిసిపోయింది.

అది కృష్ణ ఒడ్డున లంక. అమరావతికి మూడు కిలోమీటర్ల దూరంలో వున్నది.

తలుపు తెరిచి వుండటంతో ఒక్కసారిగా గాలి వీచింది. వెలుగుతున్న గుడ్డిదీపం కాస్తా ఆ గుడిసెలో మరింత నల్లదనాన్ని పులుముతూ అటూ ఇటూ ఊగి ఆరిపోయింది.

చీకటి. ముందు ఏమున్నదోకూడా కనబడనంత చీకటి. చేతులతో తడుముకుంటూ చంద్రయ్య భార్య ఉన్నవైపు నడిచాడు. మంచంకోడు కొట్టుకొని తూలిపడబోయాడు.

ఏం చేయాలీ అనే తత్తరపాటు అతడి ఆలోచనాశక్తిని పూర్తిగా నిర్వీర్యం చేసింది. రెండేళ్ళకూ, మూడేళ్ళకూ తమ లంకకు వరద వచ్చేమాట వాస్తవమే కాని, ఎత్తు ప్రదేశం చూసుకొని కట్టుకున్న తమ ఇంట్లోకి ఎప్పుడూ ఇంతవరకు నీళ్ళు రాలేదు. ఐదేళ్ళ క్రితం అయితే ఈ రెల్లుకొంపలోనే కూర్చొని, వాకిటికి పదడుగుల దూరంలో ఉరవళ్ళు పరవళ్ళతో పరుగెడుతున్న కృష్ణను, మూడురోజులు నిద్రాహారాలు లేకుండా, చూస్తూ ఉండిపోయారు అంతా. ఇంతవరకూ తనకు తెలిసి, ఇంట్లోకల్లా నీళ్ళొచ్చిన ఇలాంటి ఉపద్రవాన్ని చూడలేదు.

"ఇప్పుడు ఏం చేయాల?" అన్నది భార్య చంద్రమ్మ.

"ముందు దేవుడు పటం దగ్గర దీపారాధన అన్నా వెలిగించు... అందినంతవరకూ గుడ్డలు, విలువైన వస్తువులు రేకుపెట్టెలోకి సర్ది నెత్తినెట్టుకో... నేను మన బొట్టిగాడిని భుజం మీదకెక్కించుకుంటాను... అందరితోపాటు నీళ్ళలో పడి పరుగెత్తటమే. ఆంజనేయుడి మిద్దెమీదకెళ్దాం... లేదంటే దాని పక్కనే వీరభద్రంగారి రెండంతస్తుల మేడ ఉన్నది గదా... అక్కడికి వెళ్దాం!"

"మీ అయ్యనో?" అన్నది చిన్నగా చంద్రమ్మ.

అతడు ఉలిక్కిపడ్డట్లుగా భార్య ముఖంలోకి చూచాడు. తరువాత చికాగ్గా తల తిప్పి ఓ మూలగా కుక్కిమంచంలో పడుకొని వున్న ఎనభై యేళ్ళ తండ్రి వంక చూచాడు.

పట్టుకున్నా నడవలేని పరిస్థితి శరభయ్యది. భుజాన వేసుకొని వెళ్తేనేగాని వీలుపడదు. ఆయన్ను భుజాన వేసుకుంటే కొడుకుని ఏంచేయాలా. చంద్రికి ఇద్దామన్నా, అది పెట్టెను వదిలేస్తే వరద తగ్గి ఇంటికి వచ్చేటప్పటికి కట్టుకునేందుకు మరో గుడ్డముక్కయినా ఉండాలా? అయినా ఆయన్ను మోయటం తన ఒక్కడివల్లా అవుతుందా?

ఏం చేయాలో తోచనట్లుగా ఆ చీకట్లోనే అన్నివైపులా విసుగ్గా చూస్తుండిపోయాడు. బయట పరుగెడుతున్న జనం

**ఆంధ్రభూమి స్వర్ణోత్సవ కథల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి గెల్చుకున్న రచన**

**"ముందు దేవుడు పటం దగ్గర దీపారాధన అన్నా వెలిగించు... అందినంతవరకూ గుడ్డలు, విలువైన వస్తువులు రేకుపెట్టెలోకి సర్ది నెత్తినెట్టుకో... నేను మన బొట్టిగాడిని భుజం మీదకెక్కించుకుంటాను... అందరితోపాటు నీళ్ళలో పడి పరుగెత్తటమే. ఆంజనేయుడి మిద్దెమీదకెళ్దాం... లేదంటే దాని పక్కనే వీరభద్రంగారి రెండంతస్తుల మేడ ఉన్నదిగదా... అక్కడికి వెళ్దాం!"**

అరుస్తున్నారు- 'కట్ట తెగింది... పైనుంచి నీళ్ళు తరుముకొస్తున్నయ్ రోయ్... అందరూ బయటకు వచ్చి పరుగెత్తాలి...' అంటూ...

చంద్రయ్య బేల్దారి మేస్త్రీగా పనిచేస్తుంటాడు. రోజూ లంకనుంచి పడవలో కాలవదాటి పనిచేసేచోటకి వెళుతుంటాడు. ఎక్కువగా పని అమరావతిలోనే వుంటుంది. భార్య కూడా కూలికి అతడితోపాటే వెళ్తుంది పిల్లాడిని చంకనేసుకొని.

ముసలాడు శరభయ్య లేచి తిరిగినంతకాలం భీముడిలా ఉండేవాడు. అట్లాగే పనిచేసేవాడు. వాడూ బేల్దారి మేస్త్రీనే. వాడు సంపాదిస్తున్న రోజుల్లోనే ఆ ఇంటిని కట్టాడు. చుట్టూ ఇటుక గోడలు పెట్టించి రెండు నిట్టాళ్ళమీద రెల్లు పేనించాడు.

ఇప్పుడు వయస్సొచ్చింది. పనికెళ్ళటం మానేసే పదేళ్ళయింది. దానికితోడు రోగం. ఒక చేయి, కాలు ఆడదు. కళ్ళు సరిగా కనబడవు. ఆపైన చెవుడు. పెద్దగా అరిస్తేనేగాని వినబడిచావదు.

ఆ లంకలోనే ఓ ఆరెమ్పీ డాక్టరున్నాడు. అతడే అవసరమనుకున్నప్పుడు వచ్చి చూసి ఏవో మందులిస్తుంటాడు. తన దగ్గర లేకపోతే రాసిస్తే చంద్రయ్య పనికెళ్ళినప్పుడు అమరావతిలో కొని తీసుకొస్తుంటాడు. రోజు మొత్తంలో ఎక్కువ సమయం ఆ గుడిసెలోపలో, బయటో ఆ కుక్కిమంచంలోనే వేలాడుతుంటాడు. భీముడిలాంటి అంత మనిషి ఇప్పుడు పీనుగులా అవ్వకపోయినా, మరొకరు ఎత్తుకొని తీసుకువెళ్ళేంత తేలికగా మాత్రం లేడు.

బయట గాలికితోడు సన్నగా చినుకులూ మొదలయినయి.

చంద్రమ్మ గుడ్డి దీపపు వెలుగులో కాస్త బాగున్నయి అనుకున్న గుడ్డలన్నీ పెద్ద ట్రంకు పెట్టెలో పడేసి నెత్తిన పెట్టుకుంది.

"ఇంట్లో డబ్బులేమైనా ఉన్నయ్యా?... మేస్త్రీ ఇచ్చిన మనిద్దరి ఈ వారం కూలీ నా జేబులోనే వుంది. అందులో సగం డబ్బులు సాయంత్రం డాక్టరు రాసిచ్చిన మందులకే సరిపోతయ్!..."

"నాతాన మాత్రం ఏమున్నయి... పదో పరకో ఉంటే పెట్టెలో పెట్టా."

చంద్రయ్య కొడుకును భుజానకెత్తుకున్నాడు.

"ముసలాడి సంగతి ఏం చేద్దాం?" అన్నది చంద్రమ్మ గొణుగుతున్నట్లుగా.

"ఏం చేద్దామంటావ్?" అన్నాడు విసురుగా. "వాడిని మోయటం నావల్ల అయ్యే పనేనంటావా?" వాడిని అక్కడే వదిలేసి వెళ్ళిపోవాలని మనస్సులో అనిపిస్తున్నా, ఏ మూలనో తెలియని బంధం తటపటాయించేలా చేస్తోంది.

వాకిట్లోకి తొంగిచూశాడు ఎవరైనా కనబడతారేమోనన్నట్లుగా.

చంద్రమ్మా ఆ ముసలాడికి చాకిరీ చేయటానికి నానా యాతన పడుతున్నా, లోకంకోసం భయపడుతూ నసుక్కుంటూనో, తిట్టుకుంటూనో ఇంత వండి పడేస్తోంది!

"ఆ నీళ్ళలో నువ్వు ఆయన్నేం మోస్తావ్... ఇద్దరూ కలిసి ఏ గుంటలోనో పడి చచ్చారంటే నా తాడు తెగుతుంది!" అన్నది విసురుగా. 'కాళ్ళూ చేతులూ విరుచుకొని సంపాదించిందంతా ఇవ్వాళో రేపో అంటున్న ఆయన మొహానే పోస్తున్నాం... ఇంకా అంత లావు శరీరాన్ని ఈ నీళ్ళలో మోసి ఈయన పడిచస్తే తన గతేం కావాలి, తన బొట్టిగాడి గతేం కావాల?' మనస్సులో అనుకుంటూనే, "బయటెవరన్నా కనబడతారేమో చూడు!' అన్నది అరుస్తున్నట్లుగా చంద్రమ్మా చికాకు పడిపోతూ.

**చంద్రయ్య బేల్దారి మేస్త్రీగా పనిచేస్తుంటాడు. రోజూ లంకనుంచి పడవలో కాలవ దాటి పనిచేసేచోటకి వెళుతుంటాడు. ఎక్కువగా పని అమరావతిలోనే వుంటుంది. భార్య కూడా కూలికి అతడితో పాటే వెళ్తుంది పిల్లాడిని చంకనేసుకొని.**

అప్పటికే ఆ ఇళ్ళ చుట్టూ జనమంతా, ఊరును పాడుబెట్టేసినట్లుగా పరుగెత్తుకుపోయారు. ఎక్కడా మాటా పలుకూ వినబడటంలేదు. మరోవైపునుంచి వరద ఉధృతం పెరిగిందన్నట్లుగా హోరుమనే మోత ఎక్కువయి మరింత గందరగోళం సృష్టిస్తోంది.

"నడు!" అన్నాడు ఓ నిర్ణయానికి వచ్చినవాడులా చంద్రయ్య. భార్య అన్నమాటతో అతడికీ భయం పట్టుకుంది. ఇద్దరూ కలిసి ఏ గుంటలోనో పడితే ఆ నీళ్ళలో లేవలేకపోంగా చచ్చూరుకుంటారు.

ఈ గోలేమీ పట్టనట్లుగా ముసలాడు కళ్ళు మూసుకొని ఆ మంచంమీదే ముడుచుకు పడుకున్నాడు.

చంద్రమ్మ బయటకు వచ్చింది వడివడిగా నెత్తిన పెట్టెతో.

"మిమ్మల్ని ఆంజనేయుడి మిద్దెమీద కూర్చోబెట్టి, ఇంకెవర్నైనా తీసుకువచ్చి నాయన్ను తీసుకువస్తాలే!" అతడికీ తండ్రిని అలా వదిలి వెళ్ళటానికి బాధగానే వున్నా వెళ్ళక తప్పదన్నట్లుగా అన్నాడు.

మూతి తిప్పింది చంద్రమ్మ. 'ఆ దరిద్రంకోసం ఈ నీళ్ళల్లో పడి ఇక్కడకల్లా రావలా మళ్ళా' అన్నట్లుగా.

బయటకు వచ్చి, గుండె చిక్కబట్టుకొని తలుపు దగ్గరకు లాగి తాళం వేశాడు...

ఎనభై యేళ్ళు వచ్చినయ్. ఇవ్వాళా రేపో అన్నట్లున్నాడు. తామిద్దరూ ఒళ్ళు విరుచుకు సంపాదించిందంతా వాడి మందులకే సరిపోతోంది... మంచంలోనే నానా ఇబ్బంది పడుతున్నాడు... చూద్దాం... తను మాత్రం ఇప్పుడు చేయగలిగిందేమున్నది... తండ్రికోసం తను చచ్చి పెళ్ళాన్ని బిడ్డని చంపుకోలేడు కదా...

ఎవరి ప్రాణం వారికి తీపి!

"అరేయ్ బొట్టిగా! అయ్య తలకాయ గట్టిగా పట్టుకోరా...!" పెద్దగా అరిచింది చంద్రమ్మ పిల్లవాడివంక చూస్తూ.

- రేపు వాడే తమ మొహాన, లేచినా లేవకపోయినా, ఇంత గంజి కాచి పోయాల్సింది!

ఫర్లాంగు దూరంలో వున్న కృష్ణలో నుంచి ఉరవళ్ళు పరువళ్ళతో ముందుకు నీళ్ళు వస్తున్నట్లు వినబడుతున్న శబ్దాన్ని వింటూ మోకాళ్ళ లోతు నీళ్ళలో, గుంటలున్నయ్యేమోనని భయపడుతూనే, తెలిసిన దారి అవ్వటంతో తెగించి ముందుకు అడుగులు వేయసాగారు వాళ్ళిద్దరూ.

* * *

అప్పుడు తెల్లవారుజామున అయిదు గంటలయి వుంటుంది.

వరద నిలకడగా వున్నా చిన్న చిన్న చెట్లు, కొమ్మలు, చచ్చిన జంతువులు ఎక్కడనుంచో కొట్టుకు వస్తున్నయి ఆ నీళ్ళలో.

లంకకు దక్షిణాన తాటితోపుల్లో వుండే నలుగురు వయస్సులో వున్న కుర్రాళ్ళు ఆ నీళ్ళలోనే చిన్నగా అడుగులో అడుగేసుకుంటూ, అటూఇటూ చూసుకుంటూ వస్తున్నారు. వాళ్ళ చేతుల్లో పెద్ద పెద్ద పోలిథిన్ కవర్లున్నయి. ఒకళ్ళకొకళ్ళు ఆసరాగా పట్టుకోవాలన్నట్లుగా పెద్ద పెద్ద తాళ్ళున్నయి.

"అరేయ్ నారిగా! ప్రాణాలకు తెగించి ఈ వరదలో ఈదుకుంటూ వచ్చామా... ఇళ్ళల్లో జనమంతా పరుగెత్తారుగదా... ఇంట్లో వున్న డబ్బూ దస్కంకూడా ఎత్తుకెళ్ళి వుండర్రా!"

"అపశకునం పలుకులు పలకకురా నా కొడకా! దొరికినంతవరకూ దోచుకోవటమే... మూటలు తీసుకెళ్ళి ఏ తాడిచెట్టుమీదో పెట్టి **(మిగతా 27వ పేజీలో)**

